ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5

జయశంకర్ భూపాలపల్లి

శనివారం 11 జనవరి 2025

సీఎం సమీక్షలో పాల్గొన్న భూపాలపల్లి కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం, జనవరి 26 రిపబ్లిక్ డే నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలపై సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లతో చర్చించారు. జిల్లాలో అమలు అవుతున్న ప్రభుత్వ పథకాలపై కలెక్టర్ రాహుల్ శర్మ సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులకు వివరించారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

మేమింతే..

ప్రజలకు దూరంగా.. దందాలకు దగ్గరగా



- 11మంది కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల తీరుపై సర్వే నివేదిక
- సీఎం చెప్పినా.. మారని కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల శైలి
- డేంజర్ జోన్‌లో నలుగురు శాసనసభ్యులు, ఓ మంత్రి
- 'ఆరెంజ్'లో నలుగురు, గ్రీన్‌జోన్‌లో ఇద్దరు ఎమ్మెల్యేలు
- భూ దందాలు, సెటిల్‌మెంట్లు, ఇసుక అక్రమాల్లో జోక్యం
- లిక్కర్, రేషన్ బియ్యం, గుట్కా దందాల్లో వాటాలు
- అటు అధిష్ఠానం.. ఇటు శ్రేణులు, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- గెలిచి ఏడాదైనా.. నామినేటెడ్ పదవులు లేకపోవడంపై నాయకుల నారాజ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో సానుకూలత ఉన్నా.. కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల వ్యవహారశైలి సరిగ్గా లేదని ఓ సర్వే తేల్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలం పూర్తయిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా నిర్వహించిన సర్వేలో ఓరుగల్లు ఎమ్మెల్యేలు, ఓ మంత్రి తీరుపై ప్రజల్లో, క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైనట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్‌కు చెందిన 11మంది ఎమ్మెల్యేల్లో కేవలం ఇద్దరే గ్రీన్ జోన్‌లో ఉండగా, మిగతా ఎమ్మెల్యేలు డేంజర్, ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లుగా తేలింది. భూదందాలు, సెటిల్‌మెంట్లు, ఇసుక అక్రమ వ్యాపారాల్లో ఎమ్మెల్యేల అనుచరుల పాత్ర ఉంటోందన్న ఆరోపణలు, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. చివరికి పేదలకు అందించే రేషన్ బియ్యంతో పాటు గుట్కా దందాలోనూ కొందరి హస్తం ఉన్నట్లు తేలటంతో సీఎం కూడా షాక్ అయ్యారనే చర్చ జరుగుతోంది.

డేంజర్ జోన్‌లో ఓరుగల్లు ఎమ్మెల్యేలు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదికాలం పూర్తయింది. ఆరు గ్యారంటీల పేరుతో ఇచ్చిన అనేక హామీలను ప్రభుత్వం అమలు చేస్తోంది. అనేక పథకాలతో ప్రజల్లో ప్రభుత్వం కొంత సానుకూలత ఉన్నా.. కొందరు ఎమ్మెల్యేల వ్యవహారశైలి పార్టీకి తీవ్రంగా నష్టం కలిగిస్తుందనే చర్చ జరుగుతోంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రాష్ట్ర వ్యాప్తంగా 65మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపై ఓ సర్వే నిర్వహించారని, అందులో 28మంది ఎమ్మెల్యేలు డేంజర్ జోన్‌లో ఉన్నట్లుగా రిపోర్టు వచ్చింది. అయితే ఈ 28 మందిలో ఓరుగల్లుకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలున్నారని సమాచారం. అలాగే మరో నలుగురు ఎమ్మెల్యేలు ఆరెంజ్ జోన్‌లో ఉండగా.. వీరిపై పెద్దగా ప్రజల్లో వ్యతిరేకత లేకపోయినప్పటికి.. ఆశించిన స్థాయిలో పనులు చేయటం లేదని, పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న అభిప్రాయాలున్నట్టు తెలిసింది. ఇక వరంగల్ నగర పరిధిలోని ఒకరితో పాటు సమీపంలోని మరో ఎమ్మెల్యే మాత్రం గ్రీన్ జోన్‌లో ఉన్నట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 మంది ఎమ్మెల్యేల్లో ఆశించిన స్థాయిలో పనితీరు కనబరుస్తున్నది కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలేనని సర్వే రిపోర్టులో పేర్కొన్నట్లుగా సమాచారం. వరంగల్ నగరంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలోని కొంత మంది ఎమ్మెల్యేల పనితీరు కూడా బాగా లేదనే చర్చ జరుగుతోంది.

రేషన్ బియ్యం, గుట్కా, భూదందాల్లో హస్తం..

ఏడాది కాలంగా ప్రజల్లోకి వెళ్లటం కంటే.. వ్యక్తిగత పనులు, భూదందాలు, సెటిల్‌మెంట్లపైనే కొందరు ఎమ్మెల్యేలు, వారి అనుచరులు దృష్టిపెట్టారని సర్వేలో తేలింది. ప్రధానంగా ఓ ఎమ్మెల్యే ఉద్యోగుల పోస్టింగుల్లో

మిగతా 7వ పేజీలో...

కేడర్ నారాజ్..

ఎమ్మెల్యేలుగా గెలిపించేందుకు ఎంతో కష్టపడిన కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నట్టు సర్వేలో తేలింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఇప్పటికీ కేడర్ చేతికి పైసా పని రాలేదు. అంతేకాకుండా నామినేటెడ్ పోస్టుల ఊసే లేదు. దీంతో కేడర్ కూడా ఎమ్మెల్యేల తీరుపై అసహనంగా ఉన్నట్టు తేలింది. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌తో పాటు ఇతర చోట్ల ఉన్న వ్యవసాయ మార్కెట్లు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, ఇతర జిల్లా స్థాయిలో కీలకమైన నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఎమ్మెల్యేలు ఆసక్తి చూపడం లేదని కేడర్‌లో అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. అలాగే రాజకీయాలనే వృత్తిగా నమ్ముకుని అనేక మంది ద్వితీయశ్రేణి నేతలున్నారు. పదేళ్లు అధికారానికి దూరంగా ఉండి ఆర్థికంగా, మానసికంగా నష్టపోయిన నేతలున్నారు. ప్రభుత్వం రాగానే ఏదో ఒకటి దక్కుతుందనే ఆశతో ఉన్న నేతలు ఇటు నామినేటెడ్ పదవులు రాక.. అటు చేసేందుకు పనులు లేక అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్‌తూర్పు, ములుగు నియోజకవర్గాల్లో కూడా పూర్తి స్థాయిలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయకపోవటంతో కేడర్‌లో ఆందోళన వ్యక్తమవుతున్నట్టు సర్వే రిపోర్టులో పేర్కొన్నట్టు సమాచారం. రాష్ట్రస్థాయి నేతలకు నామినేటెడ్ పదవులను ఇచ్చి.. ఎమ్మెల్యేల గెలుపు కోసం కిందిస్థాయి నుంచి పని చేసిన తమకు మొండిచేయి ఏమిటనే ఆవేదనలో శ్రేణులున్నట్టు సమాచారం.

ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు

- కిక్కిరిసిన ఆలయాలు
- పోటెత్తిన భక్తజనం



కోటంచలో గరుడ వాహనంలో స్వామి వారిని ఊరేగిస్తున్న దశ్యం



కాళేశ్వరంలో ఉత్తరద్వార దర్శనం ప్రారంభిస్తున్న అర్చకులు

రేగొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని ఉదయం పూలవాహనంలో (గరుడవాహనసేవ) ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొని నృత్యాలు చేస్తూ గోవిందనామస్మరణలో తరించారు. అనంతరం ఉత్తరద్వారం గుండా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు చేయగా ఆలయ ఈఓ మహేశ్, అర్చకులు బుచ్చమాచార్యులు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు సముద్రాల సురేష్ ఆచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు. మండల కేంద్రానికి చెందిన భజన బృందం భక్తిగీతాలతో సందడి చేశారు. కోటంచ ఆలయ చైర్మన్ భిక్షపతి, ఇతర నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

కాళేశ్వరంలో..

మహదేవపూర్ : మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనాలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నాలుగు గంటల నుంచి సీతారామచంద్రస్వామికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో , మంగళవాయిద్యాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. మహారాష్ట్ర , చత్తీస్‌గడ్ నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి తరలివచ్చి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ, ఫణకంఠి నగేష్‌శర్మ, ఆలయ పూజారి రామాచారితో పాటు ఆలయ ఈవో మారుతి, సిబ్బంది, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

- మిగతా వివరాలు 8లో ...

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

పుష్కరాలు, మహాకుంభాభిషేకానికి కాళేశ్వరం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగొద్దు

రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

6



కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వరంలో ముక్తీశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న దేవాదాయ కమిషనర్ శ్రీధర్

కోర్టు ఆవరణలో ముందస్తు సంక్రాంతి పోటీలు

తిలకించిన జిల్లా జడ్జీలు



ముగ్గులు వేస్తున్న న్యాయవాదులు, సిబ్బంది

భూపాలపల్లి కృష్ణ కాలనీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బంది, న్యాయవాదులు రంగవల్లులతో కోర్టు ప్రాంగణాన్ని మెరిపించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణబాబు, సీనియర్ సివిల్ కోర్టు జడ్జీ, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. జయరాంరెడ్డి ఆ ముగ్గులను తిలకించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితావని, న్యాయవాదులు బల్ల మహేందర్, పగడాల ఆనందరావు, ఎన్ విష్ణువర్ధన్‌రావు, పరమేశ్వర్, మంగళంపల్లి రాజ్‌కుమార్, తదితరులు కార్యక్రమం పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ కేంద్రం తనిఖీ

ములుగు కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని రాయినిగూడెం పీహెచ్‌సీ పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో గల ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు తనిఖీ చేశారు. ముందుగా ఆయన సిబ్బంది హాజరు రిజిష్టర్, ఓపీ, టీబీ, మందుల నిల్వ, అసంక్రమిక వ్యాధుల రిజిష్టర్లను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య సూత్రాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయాలన్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించి మందులు అందించాలని, అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించే వీహెచ్ఎన్‌డీ సందర్భంగా వచ్చే గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, తల్లిపాలు, వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. ఆయనవెంట డెమో ఇన్‌చార్జి సంపత్, ఆరోగ్య కార్యకర్త రమ, సిబ్బంది ఉన్నారు.



ములుగు మండలం రాయినిగూడెం పీహెచ్‌సీ రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

మహిళా కాంగ్రెస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలిగా శ్రీదేవి

చిట్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్, మండల కేంద్రానికి చెందిన గుమ్మడి శ్రీదేవి రెండోసారి ఎన్నికయ్యారు. ఈమేరకు శుక్రవారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు నియామక పత్రం అందజేశారు.

నలుగురు ఎస్సైలకు స్థానచలనం

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా పరిధిలో పని చేస్తున్న నలుగురు ఎస్సైలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి ఎస్సై-1గా విధులు నిర్వహిస్తున్న డి.సుధాకర్‌ను టేకుమట్ల ఎస్‌హెచ్‌ఓగా, పలిమెల ఎస్సైగా పనిచేస్తున్న తామా షారెడ్డిని కాళేశ్వరం ఎస్‌హెచ్‌ఓగా, సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎం.సాంబమూర్తిని భూపాలపల్లి ఎస్సై-1గా, సీసీఎస్‌లో పనిచేస్తున్న మరో ఎస్సై జె.రమేష్‌ను పలిమెల ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీ అయిన సీసీఎస్ విభాగానికి ఎస్సైల నియామకం చేపట్టలేదు.

పెండింగ్ పనులను పూర్తిచేయాలి

రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్



పనులపై సమీక్ష నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

మహదేవపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఆలయ ఆవరణలో మే నెలలో నిర్వహించే సరస్వతి పుష్కరాలు, మహా కుంభాభిషేకం, ఆలయ అభివృద్ధి పనులపై లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు కుటుంబసభ్యులతో కలిసి కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకుని పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఈవో కార్యాలయంలో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్ ఉన్న పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పుష్కరాలు విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వచ్చే నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు మహా కుంభాభిషేకం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహా కుంభాభిషేకానికి భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున ఆలయ అధికారులు సమన్వయంతో రాజగోపురంపైన ఒకేసారి 20 మంది నిల్చునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మే నెలలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు 19 లైన్ డిపార్ట్‌మెంట్‌ల ద్వారా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి సుమారు రోజుకు 50వేల మందికి పైగా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని కమిషనర్ శ్రీధర్ పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ద్వారా అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రూరల్ వాటర్ శాఖ ద్వారా సురక్షిత మంచినీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గోదావరి నది పరిసరాల్లో మహిళలు బట్టలు మార్చుకునేందుకు కొన్ని శాశ్వత మరుగుదొడ్లు, ఏర్పాటు చేయాలని తెలిపారు. గోదావరి నది పరిసరాల్లో మహిళలు బట్టలు మార్చుకునేందుకు శాశ్వత గదులు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, జన సందోహం ఉండే చోట చలువ పందిళ్లు, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రత్యేక టీం ఏర్పాటు చేయాలన్నారు. నేషనల్ హైవేకు అటవీ అనుమతులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలు పెండింగ్ పనులు పూర్తి చేయాలని, సమాచార శాఖ ద్వారా పబ్లిసిటీ చేయాలని ఆయన సూచించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, దేవాలయ ఈవో మారుతి, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, డివిజనల్ పంచాయతీ అధికారి వీరభద్రయ్య, దేవాదాయ శాఖ పరకాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి



కాంతమ్మ (ఫైల్)

వాజేడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని దూలాపురం గ్రామానికి చెందిన రేగ కాంతమ్మ(70) శుక్రవారం ఉదయం వంటచెరుకు కోసం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. ఈక్రమంలో గుర్తుతెలియని విషపు పాము కాటు వేసింది. గమనించని కాంతమ్మ చెట్టుకొమ్మ గుచ్చుకుందనుకుని ఇంటికి వచ్చింది. అనంతరం స్పృహ కోల్పోయి నోట్లో నుంచి నురగలు వచ్చి ఇంటి వద్దనే మృతి చెందింది. కుటుంబసభ్యులు ఆమె కాళ్లను పరిశీలించగా పాముకాటు గుర్తులు కనిపించాయని తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంతలో వ్యాపారిపై కత్తితో దాడి

- ఒకరికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రాము

కొత్తగూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో నిర్వహిస్తున్న వారాంతపు సంతలో ఓ వ్యాపారిపై మరో వ్యాపారి కత్తితో దాడి చేశాడు. గాయాలపాలైన వ్యాపారి రామును ఆస్పత్రి తరలించారు. ఇద్దరు బావ, బావమరుదులు కావడం విశేషం. ఎస్సై కుశకుమార్ తెలిపిన వివరాల ప్రకారం...వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన రాము, ముత్తోజీపేటకు చెందిన సదానందం కొత్తగూడలోని వారాంతపు సంతలో బోళ్ల వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం దుకాణ స్థలం విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సదానందం రాముపై కత్తితో దాడిచేసి, గాయపరిచాడు. గాయాలపాలైన రాముకు కొత్తగూడలోని పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం రామును నర్సంపేటలోని ఆస్పత్రికి పంపించారు. బాధితుడు రాము తల్లి లింగమ్మ ఫిర్యాదు మేరకు సదానందంపై కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్సై కుశకుమార్ తెలిపారు.



రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

ప్రమాదాల నివారణకు సహకరించాలి

- భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే సూచించారు. భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆ శాఖ అధికారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. అలాగే, డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఆ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ఈనెల 31వ తేదీ వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు జరుపుకోవడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు.. డ్రైవర్లకు దృష్టిలోపం ఉండడం ఒకటన్నారు. చాలా మంది డ్రైవర్లు అవగాహన లేక కంటి పరీక్షలు చేయించుకోవడం లేదని, తద్వారా ప్రమాదాలకు ఆస్కారం కలుగుతుందని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రవాణా శాఖ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు తప్పక పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి సంధాని, చిట్యాల సీఐ మల్లేష్, ఏవో శ్రీనివాస్, గణపురం ఎస్సై అశోక్, ఏఎంవీఐలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ నమోదు చేయాలి

- జిల్లా సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారి రాజు



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారి రాజు

ఏటూరునాగారం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క విద్యార్థికి అపార్ ఐడీ నమోదు చేయాలని ములుగు జిల్లా సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారి అర్షం రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గిరిజన సంక్షేమ అపార్ ఐడీ నమోదుపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారి రాజు హాజరై మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ నమోదు తప్పనిసరి అని తెలిపారు. జాతీయ నూతన విద్యావిధానం 2020 సిఫారసుల ద్వారా ప్రారంభమైన ఈ ప్రకియలో ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్టరీ (ఏపీఏఏఆర్) ద్వారా విద్యార్థులకు 12 అంకెల గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందన్నారు. తరగతి ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు, అడ్మిషన్ ఇన్‌చార్జ్ లేదా ఎస్ఎస్‌సీ ఇన్‌చార్జ్‌లకు అపార్ ఐడీ నమోదు బాధ్యతలను అప్పగించాలని, విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డులు, ఆధార్ కార్డు మధ్య ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ క్షేత్రయ్య, ఏసీఎంవో రవీందర్, జీసీడీవో సుగుణ, ములుగు విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

మొగుళ్లపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మొగుళ్లపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై బి.అశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామానికి చెందిన దొంగల నరేష్(35) ఐదేళ్ల నుంచి మద్యానికి బానిస అయ్యాడు. కాగా, రెండు రోజుల నుంచి అతిగా మద్యం సేవిస్తూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. సంక్రాంతి పండుగ ఖర్చుకోసం భార్య ఇంట్లో రూ.1500 ఉంచగా తీసుకుని ఫుల్లుగా మద్యం సేవించి తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన పక్కపొలం రైతు కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబసభ్యులు 108వాహనంలో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు. కాగా, మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

- రూ.45వేల విలువైన సరుకు పట్టివేత
- ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



కురవిలో గంజాయితో యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కురవి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.కురవి-ఖమ్మం రోడ్డులో కురవి ఎస్సై గండ్రాతి సతీష్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఒక వ్యక్తి పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నంచేయగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆ వ్యక్తిని తనిఖీ చేయగా బ్యాగులో గంజాయి ఉందని, తూకం వేయగా 1.5 కేజీగా తేలిందన్నారు. కురవికి చెందిన కట్ల ఉమేష్, మాధవాపురం తూర్పుతండాకుచెందిన అంగోతు రాములు చింతూరు నుంచి కురవికి గంజాయి తరలించి చిన్నచిన్న ప్యాకెట్లు చేసి కురవి, మహబూబాబాద్‌లలో అమ్ముతున్నట్లు చెప్పారు. వీరి నుంచి రూ.45వేల విలువ గల గంజాయి, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా కట్ల ఉమేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అంగోతు రాములుపై గతంలో నాలుగు గంజాయి కేసులు ఉన్నట్లు తెలిపారు. సీఐ సతీష్ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఎస్సై వెంకన్న, హెడ్‌కానిస్టేబుల్ వెంకయ్య, కానిస్టేబుళ్ల భద్రు,నరేష్,హరిబాబు,గణపతి పాల్గొన్నారు.

మొదలైన రాళ్లవాగు బ్రిడ్జి పనులు



రాళ్లవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి

ములుగు కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు రాళ్లవాగు బ్రిడ్జి పనులు మొదయ్యాయి. ములుగు-బుద్దారం దారిలో భూపాలపల్లిని కలిపే ఈ దారిలో ములుగు మండలం బండారుపల్లి వద్దగల రాళ్లవాగు ప్రధానమైంది. గతంలో ఇక్కడ నిర్మించిన లోలెవల్ కాజ్ రామప్ప చెరువు బ్యాక్ వాటర్‌లో మునిగిపోయేది. వర్షాకాలంలో వరద పోటెత్తితే రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోయేవి. రెండేళ్ల క్రితం భారీ వరదలకు కాజ్‌వే కొట్టుకుపోయింది. తాత్కాలికంగా మట్టికట్టను నిర్మించిన అధికారులు రాకపోకలకు పునరుద్ధరించారు. అయితే భారీ వాహనాలకు ఇబ్బందిగా మారింది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఇటీవల మొదలైన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వరదను తట్టుకునేలా పునాదిలో భారీ కాంక్రీటు వాల్ నిర్మించారు. త్వరలో పిల్లర్ పనులు మొదలుకానున్నాయి. వచ్చే వర్షాకాలం నాటికి బ్రిడ్జి అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.

బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

- మానుకోటలో రేపు టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర సమావేశం
- ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కోశాధికారి కేశవరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండపల్లి కేశవరావు

మహబూబాబాద్ టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ధూపదీప నైవేద్య అర్చకులతో పాటు బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పరిష్కరించాలని ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కోశాధికారి కొండపల్లి కేశవరావు కోరారు. మానుకోటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈనెల 12న మహబూబాబాద్‌లో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి ముఖ్యఅతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, యశస్విని‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఇందులో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. బ్రాహ్మణులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కల్లూరి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు రంగవఝ్జుల సుధాకరశాస్త్రి, కోశాధికారి శ్యాంసుందర్‌శర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలి



ములుగులో నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ములుగు కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బండి బాబుల ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, నాయకులు గాధం కుమార్, బైకాని మహేందర్, పాపిరెడ్డి, సాగర్, శ్రీహరి, రవీందర్‌రావు, చిన్నకొండారెడ్డి, లకావత్ రాజు, అప్పాని సురేష్ రైతులు పాల్గొన్నారు.

- మంగపేట : కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో హామీలను నెరవేర్చాలని బీజేపీ ములుగు జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మంగపేట రెవెన్యూ కార్యాలయం ఎదుట బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, స్థానిక తహసీల్దార్ రవిందర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బీజేపీ నాయకులు అందజేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షుడు రావుల జానకీరావు ఆధ్వర్యం వహించగా, బీజేపీ మండల కార్యదర్శులు నిడుదవోలు శ్రీనివాస్, బొల్లికొండ సాంబయ్య, నాయకులు మీనుగు తిరుపతి, శ్యామ్, మాలి బీమారావు, ఇస్లావత్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.
- రేగొండ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు పొలుసాని తిరుపతిరావు ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ శ్వేతారావుకు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమాను రాష్ట్రంలో అమలు చేయడం లేదని విమర్శించారు. త్వరలో రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతు కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపన్న, బీజేపీ మండల అధ్యక్షులు బండి శ్రీను, సీనియర్ నాయకులు దాసరి తిరుపతిరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిఫ్, నాయకులు సూదాటి వేణురావు, గన్‌రెడ్డి లింగారెడ్డి, బండారి రవి పాల్గొన్నారు.

ముక్కోటి వేళ స్వామివార్లను

దర్శించుకున్న ప్రముఖులు



తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్

మహబూబాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు దేవాలయాల్లో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖులు శుక్రవారం వేర్వేరుగా ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. సంవత్సరంలో ఒకసారి వచ్చే ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనంతో దేవుడిని దర్శించుకుంటే పుణ్యఫలం లభించి అంతా మంచి జరుగుతుందని నానుడి. అందుకోసం ఏటా ఏకాదశి రోజున వైష్ణవ దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుమల తిరుపతిలో జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) తక్కెళ్లపల్లి రవీందర్‌రావు దంపతులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో తులతూగాలని స్వామి వారిని వేడుకున్నారు.



తిరుపతిలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కుటుంబ సభ్యులు



భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్న ఎంపీ బలరాంనాయక్

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2521	2045
పల్లికాయ (సూక)	6200	5600
పల్లికాయ (పచ్చిది)	4400	4100
కందులు	7022	5560
పెసళ్లు	-	-
పత్తి	7205	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	15000	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	13600	13000
వండర్‌హాట్ ఏసీ	-	-
యూఎస్341ఏసీ	13600	11000
యూఎస్341	14300	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

\- వరంగల్ వ్యవసాయం





హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు



పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవి చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్



ముగ్గు వేస్తున్న సినీ నటి వైష్ణవి చైతన్య

"ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండి వంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు."





పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



ముగ్గు వేస్తున్న మహిళ



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవి చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

కల్యాణం.. కమనీయం..

వైభవంగా కొత్తకొండ వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

భీమదేవరపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం వేదపండితుల వేదమంత్రోచ్ఛరణాల మధ్య కన్నుల పండువగా శుక్రవారం రాత్రి జరిగింది. స్వామి వారి కల్యాణానికి ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఈవో కిషన్‌రావులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు స్వామివారి కల్యాణంతో ప్రారంభమయ్యాయి. శ్రీవీరభద్రస్వామి ఆలయంలో సాయంత్రం నుంచి అంకురార్పణం, ధ్వజారోహణ, స్వామివారికి రుద్రాభిషేకం, గవ్యాంతం, నిత్యోపాసన, నిత్యహోమం, వాస్తు పూజ, వాస్తుహోమం, వాస్తుబలి, ఉపనిషత్ పారాయణం, ప్రదోశకాల పూజ, గణపతి పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో తీసుకువచ్చారు. ఇటీవల రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన ధ్యాన మండపంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి పక్షాన ఉప ప్రధాన అర్చకులు కంచర్ల రాజయ్య, ముఖ్య అర్చకుడు మొగిళిపాలెం రాంబాబు, తాటికొండ వీరభద్రయ్య, వినయ్‌శర్మ, శివకుమార్, రమేష్, శ్రీకాంత్, శరత్‌చంద్రలు, భద్రకాళి సమేతులైన వీరభద్రస్వామి-భద్రకాళి అమ్మవార్లకు జీలకరబెల్లం పెట్టి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం మాంగల్యధారణ, అక్షతరోపాణం, దివ్యనీరాజనం, మంత్రపుష్పాలు, మహాదాశీర్వచనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, ఆమె తండ్రి పెద్ది వెంకటనారాయణగౌడ్‌లో స్వామివారి కల్యాణానికి వచ్చి పట్టువస్త్రాలు సమర్పించారు. కంచర్ల రమాదేవి-వెంకటేశ్వర్లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరాంరెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, డైరెక్టర్లు కొంగొండ సమ్మయ్య, కురుమల్ల మంజుల, గానబోయిన కొంరయ్య, బత్తిని శ్రీనివాస్, మాజీ చైర్మన్లు చిట్టంపల్లి అయిలయ్య, పిడిశెట్టి కనకయ్య, ఆర్ వెంకట్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్, వంగర ఎస్‌ఐలు సాయిబాబు, దివ్య తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న మంత్రి పొన్నం సతీమణి మంజుల, ఆలయ చైర్మన్, ఈవో

మేమింతే..

(5వ పేజీ తరువాయి)

భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వచ్చినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఖాకీల పోస్టింగులంటే సదరు నేతకు పండుగేనని, నియోజకవర్గంలో ఏ గ్రామంలో ఏ నాయకుడు కీలకంగా ఉన్నారో కూడా సదరు ఎమ్మెల్యేకు తెలియదని సర్వే రిపోర్టులో పేర్కొన్నట్లు సమాచారం. అంతేకాకుండా తన నియోజకవర్గ పరిధిలో భూ సెటిల్‌మెంట్లలో తలదూర్చటం ద్వారా పార్టీకి చెడ్డ పేరు వస్తుందనే చర్చ జరుగుతోంది. మరో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడే మొత్తం బదిలీలు, సెంటిల్‌మెంట్లలో జోక్యం చేసుకుంటున్నారని, సదరు ఎమ్మెల్యేకు కూడా నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో పట్టులేదని సర్వేలో తేలినట్టుగా సమాచారం. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ఓ ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని, బియ్యం దందాను అడ్డుకోవల్సిన నాయకుడే రేషన్‌మాఫియాతో చేతులు కలపడంపై రిపోర్టులో ప్రత్యేకంగా పేర్కొన్నట్టు తెలిసింది. ఇదే రేషన్ మాఫియాకు ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ మంత్రి కూడా సహకరిస్తున్నారనే చర్చ ఉంది. అలాగే ఏజెన్సీ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే గుట్కా మాఫియాను ప్రోత్సాహిస్తున్నారనే ఆరోపణలున్నట్టు సమాచారం. ఇదే ప్రాంతానికి చెందిన మరో ఎమ్మెల్యే క్యాడర్‌తో సరిగ్గా వ్యవహరించడం లేదని, బదిలీలతో పాటు ఇతర వ్యవహరలన్నీ కూడా ఆయన సతీమణి పక్యవేక్షించటంతో కార్యకర్తల్లో అసంతృప్తికి కారణంగా ప్రచారం జరుగుతోంది. ఇక ఇసుక అక్రమ దందాలో ఓ మంత్రి అనుచరుడు కీలకంగా వ్యవహరిస్తు.. ఓ జిల్లానే శాసిస్తున్నాడనే చర్చ జరుగుతుంది. మరో ఎమ్మెల్యే తీరుపై కూడా కేడర్‌లోనూ, పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. అటు ప్రజలకు... ఇటు పార్టీకి కూడా దూరంగా ఉంటున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

ఎవరా మంత్రి...?

సీఎం రేవంత్‌రెడ్డి సర్వేలో ముగ్గురు మంత్రులపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లుగా రిపోర్టు వచ్చినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఈ ముగ్గురిలో ఒకరు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి ఉన్నారని సమాచారం. భూదాందాలు, సెటిల్‌మెంట్‌లు, ఇసుక దందాలతో పాటు ప్రజలకు, కేడర్‌కు దూరంగా ఉంటున్నారని సీఎంకు రిపోర్టు వచ్చిందని సమాచారం. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండగా, జిల్లా పరిధిలో విలీనమైన మండలాల్లో మరో ఇద్దరు మంత్రులున్నారు. డేంజర్ జోన్‌లో ఉన్న మంత్రులపై అధిష్ఠానం కూడా సీరియస్‌గా ఉందనే చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన తరువాత డేంజర్ జోన్‌లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్షించే అవకాశం ఉందని, అవసరమైతే ఒకరిద్దరు మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. దీంతో సర్వే రిపోర్టు సర్వత్రా ఆసక్తికరంగా మారగా, డేంజర్ జోన్‌లో ఉన్న మంత్రి ఎవరనేది చర్చనీయాంశమైంది. ఇక ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచిన ఓ వారసుడు వ్యవహారంపై కూడా ప్రజల్లో.. ముఖ్యంగా సొంత పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్నట్టుగా సమాచారం. తన నియోజకవర్గంలో జోక్యం చేసుకుంటున్నారని స్వయంగా ఓ ఎమ్మెల్యేనే అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో అనవసరపు విషయాల్లో తలదూర్చవద్దని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సైతం సదరు వారసుడిని హెచ్చరించినట్టు చెబుతున్నారు. అంతేకాకుండా ఓరుగల్లు ఎమ్మెల్యేలు, మంత్రులు మధ్య విభేదాలు రచ్చకెక్కిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఇతర నేతల సయోధ్య కుదిర్చినా అంతర్గతంగా ఆధిపత్యం తగ్గటం లేదని అధిష్ఠానానికి నివేదికలు వెళ్లాయి. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు, మంత్రుల వ్యక్తిగత సహాయకులు సైతం తెరవెనుక చేస్తున్న దందాలు పార్టీకి, క్యాడర్‌కు చిరాకును కలిగించేలా ఉన్నాయనే చర్చ జరుగుతోంది.



వరంగల్ బట్టలబజార్‌లో వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



హనుమకొండ చైతన్యపురి వేంకటేశ్వర ఆలయంలో ఉత్తరద్వారంలో స్వామివారు



నేత్రపర్వం.. వైకుంఠ ద్వార దర్శనం

భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాసశుద్ధ ఏకాదశి వేళ శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఓరుగల్లు నగరంతో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా వైష్ణవ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే ఉత్తర ద్వార దర్శనం కోసం బారులు తీరారు. మహిళలు మంగళ హారతులతో స్వామివార్లకు నీరాజనాలు పలికారు. హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని విష్ణు ఆలయం ఎదురుగా ప్రత్యేక వేదికపై సీతారామచంద్రస్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి శ్రీసూక్త విధానంతో పాంచరాత్ర ఆగమానుసారం కలకుంట్ల మేఘనాథచార్యులు ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో లక్ష తులసీదళాలతో అర్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని హనుమద్‌గిరి రంగనాయక దేవాలయం పెద్ద కోవెలలో ఉత్తర ద్వారా దర్శనం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకులు కలకోట రాఘవచార్య, నర్సింహాచార్యల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో మంగళ హారతులతో పాల్గొన్నారు. సీతారామచంద్రస్వామి ఆలయ చిన్న కోవెలలో చెరుకుపల్లి నర్సింహాచార్య ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు జరిగాయి. హనుమకొండ అదాలత్ సమీపంలోని శ్రీభూనీళ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన వేడుకలలో ఆలయ కమిటీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వరాలయం, ఏకశిల పార్కు సమీపంలోని శ్రీరామాలయం, చైతన్యపురిలోని వెంకటేశ్వర ఆలయం, కాజీపేటలోని శ్వేతార్క మూల దేవాలయం, వడ్డెపల్లిలోని టీచర్స్ కాలనీ ఫేస్ -2 వెంకటేశ్వర ఆలయంలో కూడా ఉత్తర ద్వారాదర్శనం వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇక వరంగల్ బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజామున మూడు గంటలకే స్వామివారికి అభిషేకం, అలంకరణ నిర్వహించారు. ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, ఈవో రత్నాకర్‌రెడ్డి, ఎస్‌ఎస్ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి-ప్రభాకర్ దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గీతా భవన్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, భద్రకాళి దేవస్థానం రోడ్డులోని సింహాద్రిబాగ్ శ్రీలక్ష్మినర్సింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వ్యాపారులు, ప్రముఖులు స్వామివార్లను దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఆలయ ఈవో శేషు భారతి, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేయిస్తంభాలగుడిలో సీతారామచంద్రస్వామికి లక్ష తులసి అర్చన నిర్వహిస్తున్న అర్చకులు







బాలానగర్ వేంకటేశ్వరాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, ఏకశిలా పార్కు సమీపంలోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు

● ఉత్తరద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు ● పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● భక్తులకు ఏర్పాట్లు చేసిన అధికారులు


భూపాలపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు


నాపాక ఆలయంలో శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణం


ఏటూరునాగారంలోని రామాలయంలో పూజలు


చెరుపల్లి రామాలయంలో భక్తుల పూజలు

చిట్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నైన్‌పాక శివారులో గల నాపాక సర్వతోభద్ర ఆలయంలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ముక్కోటి ఏకాదశి కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తర ద్వార దర్శనంతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కోలాట బృందా లు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ యాదండ్ల రాజయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు. నాపాక సర్వతోభద్ర ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం సందర్శించి ఉత్తర ద్వార దర్శనంతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్, నాయకులు తొట్ల అయిలయ్య, కట్టెకోల్ల రాజు, రాంరెడ్డి, రాజు, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

● భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలో సుభాష్‌కాలనీలో గల రామాల యంలో, మంజూర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు వైభవంగా జరిగాయి. ఆయా ఆలయాలను నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం 5 నుంచి ఆలయాలకు భక్తులు ఇంటిల్లిపాది వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

● కాటారం(ఆంధ్రజ్యోతి):మండలంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆనందధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో ప్రత్యేకంగా మండపంలో ఏర్పాటు చేసిన ఉత్సవమూర్తిని భక్తులు, దీక్షాపరులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించా రు. బొప్పారం సీతారామచంద్రస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు కృష్ణమోహన్, భానుప్రసాద్, ప్రవీణ్, గణేష్, ఆలయాల కమిటీ ప్రతినిధులు, భక్తులు తదితరులున్నారు.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్ల వెంకటేశ్వర ఆలయంతో పాటు పలు ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రహ్లాద్‌శర్మ వెంకటేశ్వర స్వామికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు ఉత్తర ద్వారం ద్వార లోనికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మల్లారంలోని హనుమాన్ సహిత శివపంచాయతన ఆలయంలో అర్చకులు శ్యామ్‌సుం దర్ శర్మ దేవతామూర్తులకు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

● వాజేడు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకుపల్లి గ్రామంలో ఉన్న శ్రీరాముడి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● వెంకటాపురం, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వేంచేసి ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైభవంగా ఉత్తరద్వార దర్శనం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివా రిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ, ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో పలు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.


తాడిచర్ల వేంకటేశ్వర ఆలయంలో పాల్గొన్న భక్తులు

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

మేడారం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలోని ఆదివాసీ మ్యూజియాన్ని భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం బోర్లగుడెం శ్రీ స్పార్క్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు శనివారం సందర్శించారు. ఈ సంర్భంగా చిన్నారులకు క్యూరేటర్ రవి వనదేవతల చరిత్ర, ఆదివాసీల జీవన విధానాలు, పురాతన కాలంనాటి వస్తువులు చూపించి వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, మ్యూజియం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు


రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరుపుతున్న పోలీసులు

మేడారం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్‌ని పాటిద్దాం, రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం అనే నినాదంతో జనవరి 1 నుంచి 31 వరకు ఈ మాసోత్సవాలు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. మేడారం తరలివచ్చే ప్రయాణికులు, వాహనదారులు, గ్రామస్థులకు, యువకులకు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై పలు సూచనలు చేశారు. పోలీసులు, స్థానిక యువజన సంఘం నాయకులు, యువకులు ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

మేడారంలో ముందస్తు మొక్కులు

మేడారం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో భక్తులు వనదేవతలు సమ్మక్క సారలమ్మలకు ముందస్తు మొక్కులు శనివారం చెలించుకున్నారు. ఈ క్రమంలో భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేశారు. కల్యాణకట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం గద్దెలను చేరుకొని దేవతలకు పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారెలు కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 10వేలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ అధికారులు తెలిపారు.


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మహిళాశక్తి పథకాన్ని వినియోగించుకోవాలి

మొగుళ్లపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకాన్ని ద్వారా మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో హుస్సేన్ అన్నారు. మహిళాశక్తి కార్యక్రమాల్లో భాగంగా వెలుగు మండల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 60యూనిట్ల పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో హుస్సేన్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ సురేందర్‌రెడ్డి, ఏపీఎం రవివర్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, సీసీలు గాజుల బాబూరావు, బత్తిని శ్రీనివాస్, ప్రవీణ్, డీఎంజీ లాడే తిరుపతి, గ్రామసంఘాల ప్రతినిధులు, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యార్థులు కళానైపుణ్యాన్ని ప్రదర్శించాలి

ఏటూరునాగారం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రంగోలి(ముగ్గుల) పోటీలను నిర్వహించారు. ఈ పోటీలల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అనంతరం మెహందీ బ్రైడల్ ఆర్ట్ కాంపిటీషన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి, ఇందులో కూడా విజేతలను బహుమతులతో సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. రేణుక హాజరై మాట్లాడుతూ. విద్యార్థులు తమ కళానైపుణ్యాన్ని మాత్రమే కాకుండా భారతదేశ మత సామరస్యాన్ని, భిన్నత్వంలో ఏకాత్వాన్ని చాటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, డి. నవీన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త సిహెచ్. వెంకటయ్య, ఐక్యూఏసీ కన్వీనర్ పి. జ్యోతి, సంపత్, జీవవేణి, రమేష్, మున్ని, విజయలక్ష్మీతో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయాలి

కాటారం, జనవరి 10(ఆంధ్రజ్యోతి):తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన రాష్ట్ర ఐటీ,పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో శుక్రవారం మండలకేంద్రానికి చెందిన షటిల్ క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కాటారంలో షటిల్ క్రీడాకారుల కోసం ఇండోర్ కోర్టు ఏర్పాటు చేయించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారని షటిల్ క్రీడాకారుడు ఆత్మకూరి కుమార్ తెలిపారు. క్రీడల అభివృద్ధి కోసం కృషి చేస్తానని క్రీడాకారులకు మంత్రి శ్రీధర్‌బాబు హామినిచ్చారు.

బస్సు సౌకర్యం లేక ఇక్కట్లు

మేడారం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం ఊరట్టం, కన్నెపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఇబ్బందులు పడ్డారు. నేటి నుండి సంక్రాంతి సెలవులు కావడంతో ఇంటికి వెళుతున్న గ్రామానికి వస్తున్న విద్యార్థిని, విద్యార్థులు మూడు కిలోమీటర్లకు పైగా దూరం నడిచి వెళ్లాల్సి వచ్చింది. బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు టిఎస్ఆర్‌టీసీ అధికారులకు వినతిపత్రా లను నివేధించినా ఫలితం లేదని మారుమూల ప్రాంతాలపై కలెక్టర్ దృష్టి సారించాలని గ్రామస్తులు కోరారు. సరైన రవాణా వ్యవస్థ లేక నానా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, మహిళలు, ప్రయాణికులు వాపోతున్నారు. సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

యూత్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకుముందు నిరుద్యోగ యువతకు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన యూత్ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లో ఏవో రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. లేనట్లయితే పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కలువల రవీందర్, నాయకులు సద్దాం హుస్సేన్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత నిర్మాణాన్ని తొలగించాల్సిందే..

వాజేడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలో గుడిసెల పోరాట కేంద్రం వద్ద చేపట్టిన శాశ్వత నిర్మాణాన్ని తొలగించాల్సిందేనని తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్‌లు గుడిసెవాసులకు తేల్చిచెప్పారు. గుడిసెల పోరాట కేంద్రం వద్ద కొమురంభీం కమ్యూనిటీ హాల్‌ను సిమెంటు స్తంభాలతో గుడిసెవాసులు నిర్మాణాన్ని చేపట్టారు. ఈక్రమంలో శాశ్వత నిర్మాణం చేపట్టవద్దని నాలుగురోజుల క్రితం రెవెన్యూ అధికారులు గుడిసెవాసులకు తేల్చిచెప్పారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం సైతం చోటుచేసుకుంది. ఈక్రమంలో శుక్రవారం ఎస్సై రాజ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది శాశ్వత నిర్మాణం చేపట్టిన ప్రదేశానికి చేరుకుని గుడిసెవాసులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఒకరోజు వ్యవధిలో శాశ్వత నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశించారు. తమకు మరికొన్ని రోజులు సమయం కావాలని గుడిసెవాసులు కోరగా ఒకరోజు వ్యవధిలోనే తొలగించాల్సిందేనని అధికారులు వారికి సూచించారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

గోవిందరావుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చైనా మాంజా విక్రయించే దుకాణాలను ఎస్సై కమలాకర్ శుక్రవారం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నైలాన్, సింథటిక్ ధారాలతో తయారుచేసే చైనా మాంజాతో పర్యావరణానికి విపత్తుగా మారడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చైనా మాంజాను ఉపయోగించి గాలిపటాలు ఎగురవేసే క్రమంలో ఎన్నో పక్షులు, సాధారణ ప్రజలు ప్రమాదానికి గురవుతారని అన్నారు. గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడా ప్రమాదానికి గురైన సందర్భాలు అనేకం ఉన్నాయని తెలిపారు. చైనా మాంజా నిషేధమని, పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం విక్రయించినా, వినియోగించినా నేరమేనని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే పట్ల వ్యాఖ్యలు అర్ధరహితం

మల్హర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పట్ల పలువురు తాడిచర్ల భూ నిర్వాసితుల మాటలు అర్థరహితమని మాజీ ఎంపీటీసీ రావుల కల్పనమొగిళి, పలువురు భూ నిర్వాసితులు పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో సమావేశం నిర్వహించి మాట్లాడుతు పదేండ్లలో నిర్వాసితుల ఎన్నో సమస్యలను పరిష్కరించినట్లు పేర్కోన్నా రు. కార్యక్రమంలో నిర్వాసితులు అర్ని సత్యనారాయణ, రామిడి గట్టయ్య, అక్కపాక సమ్మయ్య, రాజయ్య, సమ్మయ్య, మహేందర్, సారంగు, శ్రీనివాస్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గోవిందరావుపేట మండల అధ్యక్షుడిగా సతీష్

గోవిందరావుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ మండల నూతన అధ్యక్షుడిగా మండలానికి చెందిన మార్క సతీష్‌ను నియమిస్తూ ఎన్నికల సంఘటన పర్వ్ ములుగు జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సతీష్ మా ట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం పాటుపడుతానని అన్నారు.

మంగపేట మండల అధ్యక్షుడిగా జానకీరావు

మంగపేట, జనవరి (ఆంధ్రజ్యోతి): మంగపేట మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా మండలంలోని రమణక్కపేటకు చెందిన రావుల జానకీరావును నియమిస్తూ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ నియామకపు పత్రాన్ని జానకీరావు తీసుకొని మాట్లాడారు. తన నియమకానికి సహకరించిన రాష్ట్ర జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏటూరునాగారం మండల అధ్యక్షుడిగా చక్రవర్తి

ఏటూరునాగారం, (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మండల భారతీయ జనతా పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన విను కొల్లు చక్రవర్తి నియమితులయ్యారు. మండల యువ మోర్చా అధ్యక్షుడిగా, జిల్లా యువ మోర్చా కార్యదర్శిగా ఉన్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని చక్రవర్తిని జిల్లా నాయకత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని ఈ నియామకాన్ని అధికారికంగా శుక్రవారం ప్రకటించారు.

మొగుళ్లపల్లి అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రెడ్డి

మొగుళ్లపల్లి : భారతీయ జనతాపార్టీ మండల అధ్యక్షుడిగా మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన మోరె వేణుగోపా ల్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా మండలంలోని ఇస్సిపేట గ్రామానికి చెందిన పెండ్లి మల్లారెడ్డిలను నియమించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎన్నికల అధికారి చందుపట్ల కీర్తి-సత్యపాల్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకులు నాగపురి రాజమౌళిగౌడ్‌లు శుక్రవారం ప్రకటించారు.

రేగొండ అధ్యక్షుడిగా బండి శ్రీనివాస్

రేగొండ : రేగొండ మండల బీజేపీ మండల అధ్యక్షుడిగా దుంపిల్లపల్లికి చెందిన బండి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిశీదర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎన్నుకునేందుకు సహకరించిన రాష్ట్ర జిల్లా నాయకులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తానని కార్యకర్తలు నాయకులను సమన్వయం చేసుకుని పని చేస్తానని తెలిపారు.

మాదకద్రవ్యాల కోసం పోలీసుల తనిఖీలు

ములుగు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టే క్రమంలో శుక్రవారం ములుగు పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని బండారుపల్లి రోడ్డులో ఉదయం వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. డ్రగ్స్‌ను గుర్తించడంలో శిక్షణ పొందిన జాగిలంతో బ్యాగులను పరిశీలించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను రవాణా చేయడం, విక్రయించడం, సేవించడం చట్టరీత్యా నేరమని ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం పోలీసులకు తెలుపాలన్నారు.

కాళేశ్వరం ఆలయ స్థాయిని పెంచాలి

మహదేవపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పవిత్ర ప్రసిద్ధిగాంచిన కాళేశ్వర ముక్తీశ్వర దేవాలయానికి అసిస్టెంట్ కమిషనర్ హోదా పెంచాలని మహదేవపూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకారి రాజబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయానికి భక్తులు దినదినం పెరుగుతున్నందున ఇన్‌చార్జి ఈవో పరిపాలన కావడంతో ఆలయానికి అసిస్టెంట్ హోదా కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలని వినతిపత్రాలన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం, జనవరి 10(ఆంధ్రజ్యోతి):కాటారం 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహదేవపూర్, పలిమెల, మల్హర్, మహాముత్తారం మండలాల్లో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాటారం ఏడీఈ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాటారం మండలంలోని 4సబ్ స్టేషన్లు, మహదేవపూర్‌లో 4, మల్హర్‌లో 5, పలిమెల, మహాముత్తారం మండలాల్లో ఒక్కో సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని, ఏడీఈ పేర్కొన్నారు.

నేడు ఎల్కేశ్వరానికి మాజీ స్పీకర్

మహదేవపూర్ రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్కేశ్వరం గ్రామంలో నేడు మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదన చారి పర్యటించనున్నారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో కలిసి చిన్నకాళేశ్వరం పరిధిలోని మందిరం చెరువు నుంచి ఎన్కపల్లి వరకు చేపట్టబోయే మెయిన్ కెనాల్‌లో భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడను న్నట్లు బీఆర్ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. నష్టపరిహారం ఇవ్వకుండా భూమిలో కెనాల్ పనులు చేపడతున్నారంటూ పలువురు రైతులు ఆందోళన దిగడం, ఆత్మహ త్యాయత్నానికి పాల్పడడం తెలిసిందే. ఈనేపథ్యంలో బాధిత రైతులకు పరిహారంపై ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నట్లు సమాచారం.

కొనసాగుతున్న ఈజీఎస్ ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నామమాత్రంగా కొనసాగుతోంది. మండలవ్యాప్తంగా 25గ్రామపంచాయతీలలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వరకు ఉపాధిహామీ పనుల్లో రూ.2కోట్ల30లక్షల పనులు జరగగా ఆ పనులను సామాజిక బృందం గుర్తించి పలు అంశాలను ప్రజావేదికలో వెల్లడించింది. కాగా, రాత్రి వరకు కూడా గ్రామాలు పూర్తికాలేదు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ మంజులాదేవి, క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరమ్‌సింగ్, ఎంపీడీవో హుస్సేన్, ఇన్‌చార్జి ఏపీవో అలీమ్, ఇన్‌చార్జి ఏసీ కిరణ్, ఎస్సార్పీ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రాముతోపాటు వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

కాటారం, జనవరి 10:మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాల్లో సంక్రాంతి పండుగ ముందస్తు సంబరాలు నిర్వహిం చారు. నేటి నుంచి పండుగ సెలవులు ఉండడంతో శుక్రవారం విద్యార్థులు ముగ్గులు, భోగిమంటలు వేయడం, భోగిపళ్ల తలపై పోయడం, పతంగు ల ఎగురవేత, హరిదాసుల వేషధారణలతో సందడి చేశారు. మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు విద్యాలయాల ప్రిన్సిపాళ్లు లాల్, నాగలక్ష్మి, మానస, సునీత, శివలక్ష్మి, ఎంఈవో శ్రీదేవి, ఉపాధ్యాయులు కిషన్‌నాయక్, పరం సింగ్, రాజయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట, జనవరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఇదేక్రమంలో మంగపేట జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో జరిగిన వేడుకలలో స్థానిక ఎంఈవో పొదెం మేనక ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. తెలుగు ప్రజలు ఏంతో ఇష్టంగా కొత్త పంటలు ఇంటికోచ్చే సమయానికి చేపుకునే మకర సంక్రాంతి పండుగ సంబరాలను ముందస్తుగా నిర్వహిం చుకోవడం నిర్వహించుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఈ సందర్భం గా బోగి మంటలు ఏర్పటు చేసి రంగవల్లీల పోటిలు నిర్వహించి విజేతలకు బహుమతులను అంధజేశారు. ఈ సంబరాలలో విద్యార్థులు అందరు సంతోషంగా పాల్గోని విజయవంతం చేశారు. ఈ వేడుకలలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్లుచ కరస్పాండెంట్లు, ప్రిన్స్‌పాల్స్, విద్యార్థులు పాల్గోన్నారు.

● ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని బరిగలోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థినీవిద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశా ల ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేసి గాలిపటాలు ఎగురవేశారు. ప్రధానోపాధ్యాయుడు తిరుణహరి మనోహర్, ఉపాధ్యాయుడు ఎమ్డీ.ఇర్ఫాన్‌పాషా, అంగన్‌వాడీ టీచర్ ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహదేవపూర్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని విద్యార్థినులు ఎంతో అందంగా ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్ర పలకల ప్రసాద్, అధ్యాపకులు అబ్దుల్ ఘని సమ్మయ్య, సదాశివ సదానందం, సంధ్య పాల్గొన్నారు.


ములుగులో సంబరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


మహదేవపూర్ ప్రభుత్వ కళాశాలలో సంబరాలు


కాటారం ఆదర్శ విద్యాలయంలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినిలు


మంగపేట ప్రభుత్వ పాఠశాలల్లో భోగి మంటల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు